క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న గ్రామస్తులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని గొంగ్లూర్‌లో మూడు రోజులుగా గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పాతకాలం నాటి బొడ్రాయి రోడ్డు మరమ్మతుల్లో పోవడంతో కొత్తగా గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. క్రమంలో మూడు రోజుల నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్ రాంచంద్రారెడ్డి,గ్రామ యువకులు గోపాల్‌రెడ్డి,నాగేష్ గౌడ్, రామక్రిష్ణరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, అశోక్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రెండోసారి బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగప్రభుగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న మల్లేశ్‌గౌడ్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర గ్రామానికి చెందిన నాగ ప్రభుగౌడ్‌ని రెండోసారి బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహేశ్, చంద్రంగౌడ్, రాజేష్, కుమార్, హనుమంతు నర్సాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి, బీజేపీ నాయకులు నగేశ్‌గౌడ్, చిలిపిచేడ్ మండల ఉపాధ్యక్షుడు, నారాయణరెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

జిన్నారం (పటాన్‌చెరు): రెండు నెలలుగా తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని గాంధీనగర్ కాలనీవాసులు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో గత రెండు నెలలుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు మండిపడ్డారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కాలనీకి మిషన్‌భగీరథ నీటిని అందించాలని కోరారు. సమస్యను పరిష్కరించని పక్షంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

గేట్లు మూసివేత



భెల్ యాజమాన్యం మూసివేసిన గేట్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ చుట్టూ ఉన్న పలు కాలనీలకు వెళ్లే గేట్లను శుక్రవారం భెల్ యాజమాన్యం మూసేసింది. బుధవారం సంత నుంచి ఎంఐజీ కాలనీకు వెళ్లే మార్గం, మూతపడిన శ్రీనివాస్ థియేటర్ గేట్, మ్యాక్‌సొసైటీ గేట్, సీఐఎస్‌ఎఫ్ గేట్లను పూర్తిగా మూసివేశారు. దీంతో భెల్ కాలనీలోకి వచ్చే స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ప్రజల అవసరాల దృష్ట్యా ఉదయం సమయంలో గేట్లను తెరిచేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నలుగురికి గాయాలు

19 మందిపై కేసు నమోదు

కంగ్టి,(నారాయణఖేడ్): ఇరువర్గాలకు చెందిన వారు రాళ్లు, కట్టెలతో దాడులకు పాల్పడడంతో నలుగురికి గాయాలైన సంఘటన కంగ్టి మండలం నాగుర్(కే)లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్ ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం బుధవారం ఉదయం సీసీ రోడ్డుపై నల్లా నీళ్ల వద్ద సంతోష్ పళ్లు తోముకొంటూ ఉమ్మడంతో మహాదేవ్, సంతోష్‌లు గొడవపడ్డారు. గ్రామపెద్దల చొరవతో గొడవ సద్దుమణిగింది. కాగా అదే రోజు రాత్రి పరస్పరం దాడులకు దిగడంతో నలుగురికి గాయాలయ్యాయి.మహాదేవ్ వర్గంవారు రాత్రి తలుపులు పగులగొట్టి తమ కుటుంబీకులపై దాడికి పాల్పడినట్లు జగన్నాథ్ ఫిర్యాదు చేశారు. తలకు గాయాలైన అశోక్, వీర్‌శెట్టి, అనిత, జగన్నాథ్‌లను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలకు చెందిన 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. జగన్నాథ్ ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదయింది. అలాగే, ఆలూరే ప్రభు ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గడపదాటితే గడబిడే!

- మరుగుదొడ్ల నిర్మాణాలపై చర్యలు శూన్యం
- సంతలు, బస్టాండ్‌ల్లో కనిపించని దైన్యం
- మహిళల ఆరోగ్యంపై ప్రభావం



సదాశివపేట సంతలో ప్రజలు

సదాశివపేట(సంగారెడ్డి): జనాభాకు అనుగుణంగా వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రతి ఏటా పరిధి విస్తరిస్తున్నా సౌకర్యాలు మెరుగుపడటం లేదు. ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు తగినన్ని నిర్మించడంలో అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా మహిళలు చెప్పుకోలేని బాధను అనుభవిస్తున్నారు. జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, పటాన్‌చెరు, ఆర్‌సీపురం, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, ప్రాంతాల్లో వారాంతపు సంతలు, ప్రయాణ ప్రాంగణాల్లో సరిపోను మరుగుదొడ్లు , ముత్రశాలలు లేకపోవడంతో మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. లక్షకు పైగా జనాభా ఉన్న సంగారెడ్డి పట్టణం ప్రధాన వాణిజ్య ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. ప్రయాణ ప్రాంగణంలో నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజా మరుగుదొడ్లు సరిపోనన్నీ లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. నిత్యం వందలాది మంది విద్యార్థులు చదువుకునేందుకు కళాశాలలకు వస్తుంటారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంతో సంగారెడ్డి బైపాస్ రోడ్డు, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, సంగారెడ్డి పట్టణ మండలంలోని మహిళలు విక్రయాలకు వస్తుంటారు. జిల్లాలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేవారిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇక్కడకు మహిళలు, విద్యార్థునులు వేల సంఖ్యలో వస్తుంటారు. వీరికి సరిపడ మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. సదాశివపేట పట్టణంలో ఆదివారం, బుధవారం జరిగే వారాంతపు సంతలకు దాదాపు 5 వేల మంది వరకు మహిళలు వస్తారు. ఇక్కడ కూడా వసతులు లేకపోవడంతో మహిళలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

చోద్యం చూస్తున్న యంత్రాంగం

జనాభాకు అనుగుణంగా ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణంలో యంత్రాంగం చోద్యం చూస్తోంది. ఏన్నో ఏళ్ల నుంచి పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. పాలకులు మారుతున్నా తమ బాధలు ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తమవుతుంది. తైబజార్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ మూత్రశాల నిర్మాణాల గురించి పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాబాధ వర్ణనాతీతం



ప్రతి బుధవారం, ఆదివారం జరిగే వారాంతపు సంతలో కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు వస్తాం. మధ్యాహ్నం వచ్చి సాయంత్రానికి ఇంటికెళ్తాం. సంతల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు, గంటల పాటు మాబాధ వర్ణనాతీతం. ఇక్కడ సౌకర్యాలు కల్పించాలి.

– ఎన్.జయమ్మ గృహిణి

కిడ్నీ సంబంధిత వ్యాధులు



మూత్రాశయంలో ఎక్కువ సేపు మూత్రాన్ని నిల్వ ఉంచుకోవడంతో కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఇతర మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. నొప్పి ఎక్కువగా ఉంటుంది. మూత్ర సంబంధిత వ్యాధులు మహిళలకు ఎక్కువగా వస్తున్నాయి. ఆరుబయటకు వెళ్లితే తిరిగి ఇంటికి వచ్చేంతవరకు మహిళలు మూత్రాన్ని ఆపుకోవడం వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– డాక్టర్ జేమియా ఈఎస్ఐ ఆస్పత్రి, సదాశివపేట

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



బడిబాటలో భాగంగా నిర్వహించిన ర్యాలీ

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సంపూర్ణ మానసిక వికాసంతో ఎదుగుతారని రాయికోడ్ ఉన్నత, పాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖైరత్ అలీ, శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం రాయికోడ్‌లో ‘బడిబాట’లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, సౌకర్యాలు, బోధన తీరు, ప్రభుత్వ విద్యా పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను చదివించడం ఆర్థికంగా తల్లిదండ్రులకు భారంగా మారుతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందించి పిల్లలకు ఒత్తిడి లేని నాణ్యమైన చదువును అందిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వర్, యాదవులు, శోభారాణి, సంగీత, సునీతాదేవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మీ పిల్లల భవిష్యత్ బాధ్యత మాది

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతోందని మండల విద్యాధికారి గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోతులబోగుడా, మర్వెల్లి, దేవునూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మీ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, మీ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు.

ఇంటింటికీ ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని నాగల్‌గిద్ద, ఖేడ్ ఎంఈఓలు మన్మథకిషోర్, విశ్వనాథ్‌లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని పూజలు



గణేష్‌గడ్డ దేవస్థానంలో అర్చకులు

పటాన్‌చెరు టౌన్: భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు శుక్రవారం గణేష్‌గడ్డ దేవస్థానంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాల ఏరివేతే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ని కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఈ ఆపరేషన్ విజయవంతం కావాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా శాంతి, సామరస్యం కొనసాగాలని హోమం నిర్వహించామన్నారు. భారతావనిపై ఆ గణనాథుని కృపాకటాక్షం ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. పూజా కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీశ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

యూఎస్‌ఎఫ్ఐ నాయకులు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు తప్పుడు ప్రచారం చేస్తూ.. విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనుమతి రాకున్నా పాఠశాలలు ప్రారంభించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించి విద్యను వ్యాపారంగా మారుస్తున్నా ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలు అడ్మిషన్ల ప్రారంభంపై ప్రశ్నిస్తే త్వరలోనే అనుమతులు వస్తాయని చెప్తూ మోసగిస్తున్నారని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, రవితేజ తదితరులు ఉన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ లక్ష్మీ నరసింహస్వామి మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా 2025 –26 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, బీబీఏ కోర్సులు 780 సీట్లు ఉన్నాయని, దోస్త్ ద్వారా ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని సూచించారు. ఫేజ్–1 రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 3 నుంచి 21 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల దోస్త్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ 9666266222ను సంప్రదించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి



కొనుగోలు కేంద్రాన్ని, ప్రారంభిస్తున్న వంశీకృష్ణ

నారాయణఖేడ్: దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా జొన్నలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని ఖేడ్ ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, ఎఫ్‌పీఓ సీఈఓ రామారావు పేర్కొన్నారు. మండలం పరిధి సంజీవన్‌రావుపేటలో శుక్రవారం మార్క్‌ఫెడ్ సౌజన్యంతో మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జొన్నలు క్వింటాలుకు రూ.3,371 మద్దతు ధరగా చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మాణిక్‌గౌడ్, ఏఈఓ సతీష్‌కుమార్, వీఓఏ శ్రీనివాస్, సాయిలు, కిషన్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఝాన్సీ

సంగారెడ్డి టౌన్ : రైతులు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని సంగారెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరీచర్ల గ్రామంలో నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పూర్తి వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని పశువులకు తాపొద్దు



పశువుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

రాయికోడ్(అందోల్): అకాల వర్షాలతో కుంటలు, కాలువలు, చెరువుల్లో నిలిచిన నీటిని పశువులకు తాపించొద్దని మండల పశువైద్యాధికారి పాండియన్ పోషకులకు సూచించారు. మండలంలోని ధర్మాపూర్‌లో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో నిలిచిన నీటిలో బాక్టీరియా, వైరస్‌లు ఉంటాయన్నారు. శుభ్రమైన నీటిని పశువులకు తాపాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులను మేతకు తరలించి వాటి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఘని, గోపాల మిత్ర బాబయ్య , పోషకులు ఉన్నారు.

మధుకుమార్‌కు సన్మానం

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతిలో 86 శాతం మార్కులు సాధించిన మధుకుమార్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్మానించారు. గతంలో విద్యుత్ షాక్‌తో మధుకుమార్‌కు చేతులు, కాళ్లు కోల్పోయాడు. నోటితో హీరో చిరంజీవి పెయింటింగ్ వేసి చిరంజీవికే ఇవ్వడంతో ఆయన అభినందించారు. చదువుపై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా పదిలో మంచి మార్కులు సాధించడంతో కంకోల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి శుక్రవారం తన కార్యాలయంలో మధుకుమార్, వారి తల్లిదండ్రులను సన్మానించారు. జీవితంలో ఏం అవసరమున్నా ఆదుకుంటానని కలెక్టర్ మధుకుమార్‌కు భరోసా ఇచ్చారు. మధుకుమార్‌కు కలెక్టర్ క్రాంతి ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి లింబాజి, ఎంఈఓ భీమ్‌సింగ్, కంకోల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మధుకుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ క్రాంతి

పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్ శివారులో జాతీయ రహదారి వెంట మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. నెల రోజులుగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హెచ్‌డీపీ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీరు లీకేజీ అయి అటవీ ప్రాంతంలో నీటి కొలను తలపించేలా మారింది. పాదాచారులు పగిలిన పైప్‌పైన బండరాయి పెట్టినా లీకేజీ ఆగడంలేదు. అసలే వేసవి కాలం కావడం.. పగిలిని పైప్‌లైన్‌ను అధికారులు మరమ్మతులు చేయపోవడంతో నీరు వృధాగా వెళ్లడంపై స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పత్రికల గొంతు నొక్కడమే

- 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంపై దాడిని ఖండించిన జర్నలిస్టులు
- జహీరాబాద్ ఆర్డీఓకు వినతి పత్రం



ఆర్డీఓకి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మినాజ్, జర్నలిస్టులు

జహీరాబాద్: 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు దాడి చేయడం పత్రికల గొంతునొక్కడమేనని జర్నలిస్టు సంఘాల నేతలు పేర్కొన్నారు. ధనంజయరెడ్డి నివాసంపై దాడిని నిరసిస్తూ పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు శుక్రవారం జహీరాబాద్ ఆర్డీఓ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు యెర్పల్ శ్రీనివాస్‌రెడ్డి, మినాజ్ మాట్లాడుతూ...ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సంపాదకుడి నివాసంలోకి చొరబడి సోదాలు చేయడం సరికాదన్నారు. ఇందుకు కారణమైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడమే తప్పవుతుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు అక్తర్ హుస్సేన్, ఆర్.సత్యనారాయణరెడ్డి, బస్వరాజ్, మల్లన్న, ఎం.డి.అయూబ్, రహమతుల్లా, అహ్మద్, షౌకత్‌అలీ, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు లక్ష్మీనరసింహస్వామి జయంతి

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణం శ్రీనగర్‌లో వెలిసిన శ్రీక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి జయంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాయి కోటి రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మాధవానంద స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉ.8 గంటలకు 108 కలశాలతో చెరుకు రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. సా.6 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

పటాన్‌చెరు: ఐనోల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉ.10 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సిటిజెన్‌కాలనీ, సాయికాలనీ, ఆర్.కే నగర్ కాలనీ, ఆనందనగర్, సాయి వైభవ్‌కాలనీ, నవ్యకాలనీ, పీఎన్‌ఆర్ టౌన్ , పార్వతీ పురం, కురం బస్తీ, మహాదేవపురం, హారతినగర్, నవ్యాతులసి కాలనీలో కరెంట్ నిలిచిపోనుందని చెప్పారు.

◆ పిల్లలను బడిలో చేర్పాలి..

మునిపల్లి(అందోల్): బడీడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతున్నారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి, మునిపల్లి, కంకోల్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి చదువుపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుతున్న విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో చేరే వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు తెలుసుకుంటున్నారు. బడిలో చేరే విద్యార్థుల జాబితాను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు రాసుకుంటున్నారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. గురువారం నిర్వహించిన తనిఖీలో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ఒకరికి రూ.1500 చొప్పున, మరో 14 మందికి రూ. వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ రామేశ్వర ఆలయ కమిటీ ఎన్నిక

ఝరాసంగం(జహీరాబాద్): పురాతన దేవాలయాల్లో ఒకటైన రామేశ్వర ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం ఆలయ ఈఓ శివరుద్రప్ప చైర్మన్ వడ్ల రాజేందర్‌తో పాటు సభ్యులు సతీష్‌గౌడ్, నర్సింలు, మొగలయ్య, నాగమ్మతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయానికి మొట్టమొదటిగా కమిటీని ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు. నూతన పాలక మండలి సభ్యులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, కేతకీ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, సీనియర్ నాయకులు శంకర్ పాటిల్, సంగ్రామ్ పాటిల్, మారుతిరావు పాటిల్, ఉదయ్‌శంకర్ పాటిల్ పాల్గొన్నారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి పరిధిలోని బాలాజీ సాయిరాం కాలనీలో హనుమాన్ దేవాలయం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో హనుమంతుడు, శివలింగానికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు చేశారు. గణపతి హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తత

జహీరాబాద్ టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి అన్నారు. మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రజలకు సైబర్ నేరాలు, సీసీటీవీ కెమెరాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, నేరగాళ్ల వలలో పడి మోసపోవడం బాధాకరమన్నారు. ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతునాయని, వాటిపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరగాళ్ల చేతిలోనష్టపోతే వెంటనే 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు.